హద్దులెక్కడ..!

- నాలుగు చెరువులపై హైడ్రా కసరత్తు
- పైలట్ ప్రాజెక్ట్ కోసం మ్యాపుల సేకరణ
- పాతమ్యాపులతోనే సర్వే ప్రక్రియ

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): చెరువుల పునరుజ్జీవం, సుందరీకరణకు సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌పై హైడ్రా దృష్టిపెట్టింది. నాలుగు చెరువుల విస్తీర్ణం వివరాలను సేకరిస్తున్నది. ప్రస్తుతం ఎంత ఉన్నదన్న దానిపై నేషనల్ రిమోర్ట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్‌సీ సాయం తీసుకుంటున్నది. హైడ్రా పరిధిలో ఉన్న చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లకు సంబంధించి హద్దులను నిర్ణయించనున్నది. ఇందులో భాగంగా ముందు తన పైలట్ ప్రాజెక్ట్ నల్లచెరువు, ఎర్రగుంట చెరువు, అప్పచెరువు, సున్నం చెరువుల విస్తీర్ణం ఎంత, గతంలో ఎలా ఉండేవి.. ఇప్పుడెలా ఉన్నాయి అనే అంశాలపై సమగ్ర వివరాలు తీసుకుంటున్నది. హైడ్రా అభ్యర్థన మేరకు ఎన్ఆర్ఎస్‌సీ ఇటీవల 56 చెరువుల పటాలను అందజేసింది. ఇందులో ఉన్న వివరాలపై సమగ్రంగా పరిశోధన జరిపి తనకు పూర్తి వివరాలు ఇవ్వాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంస్థను కోరారు. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏవిధంగా ఆక్రమణలకు గురయ్యాయో ఎన్ఆర్ఎస్‌సీ మ్యాపులతో సహా వివరించింది. దీంతో ఆక్రమణల వివరాలతో సహా విస్తీర్ణంపై ఆయా మ్యాపులను పక్కాగా రూపొందించి ఇస్తే తాము తీసుకుంటామని రంగనాథ్ గతంలోనే సెంటర్‌కు చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్‌గా నాలుగు చెరువుల పునరుజ్జీవం, సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వీటికి సంబంధించిన మ్యాపులను త్వరగా ఇవ్వాలని ఎన్ఆర్ఎస్‌సీని రంగనాథ్ ఇటీవల కోరారు. బెంగళూరు వెళ్లి వచ్చిన వెంటనే ఈ మ్యాపుల ఆధారంగా నాలుగు చెరువుల హద్దులను ఫైనల్ చేస్తామని హైడ్రా బృందంలో ఒక అధికారి చెప్పారు.

పాతమ్యాపులతోనే సర్వే ప్రక్రియ

ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల మిగతా చెరువుల సర్వే మాత్రం పాత మ్యాపుల ఆధారంగానే జరుగుతున్నది. హైడ్రా అధికారులు బృందాల వారీగా ఒక్కో మండలంలో చెరువుల సర్వే నిర్వహిస్తున్నారు. అధికారుల బృందం 45 ఏళ్ల డేటా ఆధారంగా బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ నిర్ణయిస్తున్నారు. చెరువులకు సంబంధించి ఫుల్ ట్యాంక్ లెవల్‌తో పాటు గరిష్ఠంగా నీరు విస్తరించే ప్రాంతం మాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియాను తేల్చనున్నారు. మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్ ఆధారంగా 45 ఏళ్లలో పూర్తి స్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారం సేకరిస్తున్నారు. ఇందుకోసం ఎన్ఆర్ఎస్‌సీ, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల డేటాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే పాత మ్యాపుల ఆధారంగా సర్వే చేస్తున్నప్పటికీ.. సర్వే సమయంలో హద్దులు చెరిగిపోయి.. కొన్ని చెరువులకు హద్దులు పూర్తిగా లేకుండా ఉంటున్నాయని, వాటిని ఫైనలైజ్ చేయడం కష్టమవుతున్నదని అధికారులు చెప్పారు. మిషన్ కాకతీయ సమయంలో చెరువుల పూడికతీత, గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ కోసం చెరువులకు పునర్వైభవం తెచ్చిన నేపథ్యంలో అప్పటి రికార్డులను కూడా ఆధారంగా చేసుకొని కొన్ని చెరువుల హద్దులు ఫైనల్ చేసినట్లు తెలుస్తున్నది.

ఎన్ఆర్ఎస్‌సీ సహకారం..!

హైదరాబాద్‌లో ఎన్ఆర్ఎస్‌సీ ఇప్పటివరకు 56 చెరువులను అధ్యయనం చేసింది. గత 45 ఏండ్లలో ఆయా చెరువుల వాస్తవ విస్తీర్ణం 9,970.70 ఎకరాలు కాగా.. ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం 3975.92 ఎకరాలు. ఆక్రమణకు గురైంది 5,994.77 ఎకరాలు అని వాస్తవ విస్తీర్ణంలో 60 శాతం ఆక్రమణలకు గురైనట్లు తేల్చారు. వీటన్నిటి విషయంలో ప్రస్తుతం హద్దులు నిర్ణయించడం హైడ్రాకు పెద్ద సవాల్‌గా మారుతున్నది. ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌లోని నాలుగు చెరువుల హద్దులను నిర్ణయించి వాటిని సుందరీకరించి ప్రభుత్వానికి చూపించిన తర్వాత మిగతా వాటి విషయంలో నిర్ణయం తీసుకుంటామని హైడ్రా బృందం చెబుతున్నది. హైడ్రా ఎంపిక చేసుకున్న నాలుగు చెరువుల్లో హైడ్రా, హెచ్ఎండీఏ రికార్డుల ప్రకారం కూకట్‌పల్లి నల్లచెరువు వాస్తవ విస్తీర్ణం 27 ఎకరాలు కాగా, ప్రస్తుతం ఉన్నది 20 ఎకరాలు. నల్లచెరువులో బఫర్‌జోన్, ఎఫ్టీఎల్‌కు సంబంధించి 3 ఎకరాల్లో పలు నిర్మాణాలను హైడ్రా కూల్చేసింది. సున్నం చెరువులో కూడా ఆక్రమణలంటూ కూల్చివేతలు జరిపిన విధానంపై హైడ్రాకు స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ చేయకుండా ఎలా కూల్చివేస్తారంటూ కొందరు హైడ్రాను నిలదీశారు. ఎర్రగుంట చెరువు, అప్పచెరువు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండటంతో పక్కాగా హద్దుల నిర్ణయం తర్వాతే తమ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాలని హైడ్రా కమిషనర్ భావిస్తున్నారు. ఎన్ఆర్ఎస్‌సీ నుంచి ఈ నాలుగు చెరువులకు సంబంధించిన మ్యాపులు తీసుకుని వాటి ద్వారా హద్దులు నిర్ణయించి తర్వాత పునరుజ్జీవం, సుందరీకరణ చేయాలని నిర్ణయించినట్లు హైడ్రా అధికారి చెప్పారు. అయితే గతంలో ఈ చెరువుల పరిస్థితిని, ఆక్రమణలు ఎప్పుడెప్పుడు జరిగాయో పూర్తిగా వివరాలతో మ్యాప్స్ వచ్చిన తర్వాతే వాటి ఆధారంగా హద్దులను నిర్ణయించి పనులు చేపడుతారు. ప్రస్తుతం ఈ నాలుగు చెరువులపైనే హైడ్రా సీరియస్‌గా దృష్టి పెట్టింది. చెరువుల మ్యాపులు వస్తే సర్వే సులభంగా జరుగుతుందని కమిషనర్ భావిస్తున్నారు.

కార్తికం..శివకేశవులకు ప్రీతికరం

- ప్రారంభమైన కార్తికమాసం
- ఈ మాసానికి సమానమైన మాసం లేదు.. ప్రతిరోజూ పుణ్యప్రదమే
- ఈ మాసంలో పూజలు, వ్రతాలే
- కార్తికమాసం దీపారాధనకు ప్రశస్త్యం

షాద్‌నగర్ టౌన్, నవంబర్ 3: కార్తిక మాసంలో ప్రతిరోజూ ఆ పరమేశ్వరుడిని పూజిస్తూ, ధ్యానిస్తూ, భక్తి పారవశ్యంలో మమేకమవుతూ కార్తిక పురాణాన్ని ప్రతిరోజు ఒక్కో అధ్యాయంగా పఠిస్తారు. అత్యంత పవిత్ర, మహిమాన్వితమైన మాసం కార్తిక మాసం. కార్తిక మాసంలో మాలధారణలు, ఉపవాస దీక్షలు, వ్రతాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ఈ మాసంలో శివకేశవులకు విశేష పూజలు జరుగుతాయి. కార్తిక మాసం మొదలు నుంచే ఆకాశ దీపం ప్రారంభమవుతుంది. గృహం ముందు, పూజా మందిరంలో, తులసి సన్నిధిలో, దేవాలయాల్లో దీపారాధన చేయడం ద్వారా ఇహ, పర సౌఖ్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. హిందువులందరూ ఈ మాసాన్ని అత్యంత పవిత్ర మాసంగా భావిస్తారు. ఆధ్యాత్మిక ధార్మిక యోచనలు కలిగిన ప్రజలు ఒంటిపూజ భోజనం, నిరాహారాది వ్రతాలు చేస్తారు. రాత్రుల్లో దేవాలయాల్లో, తులసి చెట్టు వద్ద దీపాలను వెలిగిస్తారు. కార్తిక మాసం విశేష పూజలతో దేవాలయాలన్ని కార్తిక శోభను సంతరించుకుంటాయి. ఈ మాసంలో ప్రతిరోజూ పుణ్యప్రదం అని అర్చకులు చెబుతున్నారు.

ప్రత్యేక పూజలు, వ్రతాలు

ఈ కార్తిక మాసంలో దేశంలోని నలుమూలలా ఉన్న ఆలయాల్లో రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు విశేషంగా జరుపుతారు. విశేషార్చనలు జరిపే భక్తులకు సదాశివుడు ప్రసన్నుడై వారి అభీష్టాలను తీరుస్తాడు. అభీష్టాలను తీర్చే ఆ స్వామికి అశుతోషుడు అనే పేరు వచ్చింది. అదే విధంగా ఈ మాసంలో విష్ణువును దామోదర నామంతో పిలుస్తారు. కార్తిక దామోదర ప్రీత్యర్థం అని ఈ మాసాన వ్రత దీక్షను ఆచరించాలి. తులసి చెంత హరిపూజ, సత్యనారాయణ వ్రతం, విష్ణు సహస్ర నామ పారాయణం, రుద్రాభిషేకాలు చేయడం పుణ్యప్రదం.



దేవాలయం ఆవరణలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఎంతో విశిష్టత కలిగిన మాసం..

శివునికి ప్రీతిపాత్రమైన మాసం కార్తిక మాసం. ప్రతి ఏటా దీపావళి వెళ్లిన మరుసటి రోజు నుంచి అతిపవిత్రమైన కార్తిక మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో భక్తులంతా నిత్యం భోళాశంకరుని నామాన్ని స్మరిస్తూ ఉంటారు. పురాణాల నుంచే ఆ మాసం ఓ ప్రత్యేకతను సంతరించుకున్నది. ఈ కార్తిక మాసానికి ఎంతో విశిష్టత ఉంది. కార్తిక నమో మాసః అని శాస్త్ర వచనం ప్రకారం కార్తిక మాసానికి సమానమైనది లేదు. కార్తిక మాసం అన్ని మాసాల్లోకెల్లా విశిష్టమైనదని మొట్టమొదట వశిష్ట మహర్షి జనక మహారాజుకు చెప్పాడని పురాణాలు చెబుతున్నాయి. కార్తిక మాసం తెలుగు సంవత్సరాల్లో ఎనిమిదవ నెల. చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. కృనక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించుట ద్వారా ఈ మాసానికి కార్తిక మాసమనే పేరు వచ్చింది. కార్తిక మాసంలో ఉభయ పక్షములందు అనేక వ్రతాలు ఉన్నాయి. అయ్యప్ప దీక్ష ఈ నెలలో ప్రారంభమై మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది.

కార్తిక మాసం విశిష్టమైనది..

తెలుగు మాసాల్లో విశిష్టమైనది కార్తిక మాసం. కైలాస నిలయుడైన పరమశివుడికి ప్రీతిపాత్రం ఈ మాసం. ఆధ్యాత్మిక పరంగా ఆరోగ్యప్రదమైన మాసం. ఈ మాసంలో సోమవారం రోజున ఉపవాసం, రాత్రి నక్షత్ర దర్శనం చేసి భోజనం చేస్తారు. ఇలా చేయడం ద్వారా అష్టైశ్వర్య ప్రాప్తి కలుగుతుందని ధర్మసింధువు గ్రంథం చెబుతుంది. ఈ మాసంలో ప్రతిరోజూ పర్వదినమే అయినప్పటికీ కొన్ని ముఖ్యమైన పర్వదినాలు మరింత ఫలప్రదమైనవి. అవే భగినీ హస్తభోజనం, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి. ఈ కార్తికం అత్యంత పవిత్ర మహిమాన్వితమైన మాసం.

– ఎం.సంతోషశాస్త్రి,
అర్చక పురోహిత జ్యోతిష్కులు, షాద్‌నగర్

శుభ ఫలితాలు..

కార్తిక మాసంలో ఏ మంత్ర దీక్ష తీసుకున్నా మంచి ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. అభిషేక ప్రియఃశివః మనస్సులో భక్తిని ఉంచుకుని శివున్ని ధ్యానిస్తూ చేసే అభిషేకంతో శివుడు ప్రీతి చెందుతాడు. శివాభిషేకం అన్ని దోషాలను పోగొట్టి సకల శుభాలను కలుగజేస్తుంది. ఈ మాసంలో శివార్చన చేసిన వారికి గ్రహదోశాలు, ఈతిబాధలు ఉండవు. శివుడిని బిల్వదళంతో పూజించిన అత్యంత శుభప్రదం. ఈ మాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నానం చేసి తులసి కోట ముందు దీపారాధన చేసి గౌరీ దేవిని పూజిస్తే ఈశ్వరానుగ్రహంతో సౌభాగ్యాన్ని, సకల శుభాలు కలుగుతాయి.

దేవాలయాల్లో విశేష పూజలు

కార్తిక మాసం ప్రారంభంతో దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. దేవాలయాల్లో ప్రతిరోజూ నిర్వహించే పూజా కార్యక్రమాలతో కార్తిక శోభను సంతరించుకుంటాయి. దేవాలయాల్లో, తులసి చెంత దీపారాధన, వ్రతాలు చేయడం, వన భోజనాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. పట్టణంలోని శ్రీశివమారుతి గీతా అయ్యప్ప మందిరంలోని శ్రీ గిరిజామృత లింగేశ్వరస్వామికి, వివిధ దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.

దీపారాధనకు ప్రశస్త్యం

ఈ కార్తిక మాసం దీపారాధనకు ప్రశస్త్యం. దీపారాధనకు ఆవు నెయ్యి ఉత్తమం, మంచి నూనె మధ్యమం. వన భోజనాలు ఈ మాసానికి మరో విశిష్టత. ఉసిరి చెట్టు లక్ష్మీదేవికి నివాసం. కార్తిక మాసంలో ఈ ఉసిరి వృక్షం కింద భోజనం చేయడం ఎంతో అభీష్టాన్నిస్తుంది. ఉసిరి వృక్షం మొదట్లో లక్ష్మీదామోదరులను పూజించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరి చెట్టు ఉన్న వనంలో భోజనాలు చేయడం వనభోజనాలుగా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో ప్రతి రోజూ విశిష్టమైనది. ఇందులో ఉత్థాన ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి అత్యంత విశిష్టమైనవి, శ్రీమహా విష్ణువు ఉత్థాన ఏకాదశి రోజున యోగ నిద్ర నుంచి మేల్కొంటాడని విశ్వసిస్తారు. దేవ దానవులు పాల సముద్ర మదనం చేసిన రోజు క్షీరాబ్ధి ద్వాదశి. కార్తిక పౌర్ణమి అత్యంత విశిష్టమైనది. దేవాలయాల్లో జ్వాలా తోరణం వెలిగిస్తారు. ఈ రోజున నదీస్నానం, దేవాలయ దర్శనం, ఉపవాసం విధిగా ఆచరించడం ద్వారా విశేష ఫలితాలను పొందుతారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి అభినందనీయం

రాష్ట్ర పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రమణాచారి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రమణాచారి, వంశీరామరాజు తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 3 : తెలుగు భాష పరిరక్షణ కోసం పలు సంస్థలు ముందుకు వచ్చి కృషి చేయడం అభినందనీయమని రాష్ట్ర పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'తెలుగు వెలుగు' సమాఖ్య కార్యక్రమాన్ని డాక్టర్ రమణాచారి, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ.. ఇన్ని సంవత్సరాలు తెలుగు భాషను మనం సరిగా పట్టించుకోలేదని, కాని తమిళుల భాషాభిమానం చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదాను కల్పించేందుకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేసిన కృషి గొప్పదన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలుగుకు ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'తెలుగు వెలుగు సొగసు' అంశంపై ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు సుధామ, 'తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటి పదాలు' అంశంపై ప్రముఖ రంగ స్థల సినీనటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, యువభారతి కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, డాక్టర్ జీఎన్‌కే దుర్గా, కిన్నెర సంస్థ అధ్యక్షుడు మద్దాలి రఘురాం, మానస ఆర్ట్స్ అధ్యక్షుడు రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో దవాఖానల పాత్ర కీలకం

కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్, రవీంద్ర నాయక్

మాదాపూర్, నవంబర్ 3: వైద్యం అందించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల పాత్ర కీలకమని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్.రవీంద్ర నాయక్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన థానాకాన్ 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్.రవీంద్ర నాయక్ హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్.రవీంద్రనాయక్ మాట్లాడుతూ... వైద్యం అందించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రం మెడికల్ టూరిజంగా మారిందని, దేశ విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి వైద్యం చేయించుకుంటున్నట్లు చెప్పారు. దవాఖానల పరిశ్రమలోని వివిధ రంగాల్లో జాతీయ నిపుణులు తమ నైపుణ్యతలను టీహెచ్ఏఎన్ (థానా) రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ వీఎస్ రావు వివరించారు. వినియోగదారుల ఫోరం, చిన్న దవాఖానల, ఆరోగ్యం మొదలైన అనేక హాట్ టాపిక్‌లపై ప్యానెల్ చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి, డాక్టర్ నౌనిహాల్, ఆర్గనైజింగ్ కమిటీ కో చైర్మన్, డాక్టర్ ఎల్. సురేశ్ గౌడ్‌లతో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఎలెక్ట్ అధ్యక్షుడు, డాక్టర్ దిలీప్ భనుషాలి, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ కాలి ప్రసాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల డీఎంహెచ్ఓలు, డాక్టర్ వెంకటేశ్వరరావు, రాఘునాథ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నగరానికి పదివేల విదేశీ పక్షులు

బీఆర్ఎస్ ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న కొత్వాల్‌గూడ ఎకో పార్క్

హైదరాబాద్‌కు రానున్న ఆస్ట్రేలియా, ఆఫ్రికా, చైనా, అమెరికా దేశాలకు చెందిన 19 జాతుల పక్షులు

ఇంటర్నేషనల్ పక్షుల కేంద్రానికి గతంలో బీఆర్ఎస్ ప్రణాళికలు

ఎట్టకేలకు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కదిలిన హెచ్ఎండీఏ యంత్రాంగం

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ వేదికగా ప్రపంచ స్థాయి ఐవరి సెంటర్‌ను నెలకొల్పాలని బీఆర్ఎస్ ప్రణాళికలు ఎట్టకేలకు కార్యరూపంలోకి వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో విదేశీ పక్షుల కేంద్రాన్ని ప్రారంభించి పర్యాటక ప్రాంతంగా కొత్వాల్‌గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు హెచ్ఎండీఏ యంత్రాంగం కదిలింది. ఈ క్రమంలో ప్రపంచంలోని 19 ప్రాంతాలకు చెందిన వివిధ జాతులకు చెందిన పదివేల విదేశీ పక్షులను హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరిదశలో ఉండగా పక్షులను దిగుమతి చేసుకునేందుకు హెచ్ఎండీఏ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు ఈ క్రమంలో ఆస్ట్రేలియా అమెరికా ఆఫ్రికా, చైనా వంటి దేశాలకు మాత్రమే పరిమితమైన పక్షి జాతులను కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు తరలించనున్నారు.

హైదరాబాద్ వేదికగా ప్రపంచంలోని అతిపెద్ద ఐవరీలలో ఒకటిగా కొత్వాల్‌గూడలోని ఎకో పార్క్ నిలువనుంది. ఆస్ట్రేలియా, పెరూ, అర్జెంటీనా, న్యూజిలాండ్ యునైటెడ్ స్టేట్స్, చైనా వంటి దేశాల నుంచి 10,000 విదేశీ పక్షులు కొలువు దీరనున్నాయి. అప్పటి సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్ కేంద్రంగా వరల్డ్ క్లాసు టూరిజం స్పాట్‌గా కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌ను అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. హెచ్ఎండీఏ 19 రకాల జాతులకు చెందిన విదేశీ పక్షులను సేకరించనున్నది. ఆస్ట్రేలియా, పెరూ, అర్జెంటీనా, న్యూజిలాండ్, యునైటెడ్ స్టేట్స్, చైనా, జపాన్, నికోబార్, ఇండోనేషియా వంటి దేశాలలో మనుగడ సాగించే వివిధ రకాల పక్షులను హైదరాబాదుకు తీసుకురానున్నారు. ఈ క్రమంలో అక్కడి పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా హైదరాబాద్ ఐవరి కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ జాబితాలో బ్లూ, గోల్డ్ మకావ్, గ్రీన్ వింగ్ మకావ్, స్కాలర్ మకావ్, కాక్టోస్, అమెజాన్ పారెట్, ఎక్లెక్టస్ పారెట్, కోనేరస్, కాక్ టైల్స్, బగ్గీస్, డౌస్, ఫించేస్, రెయిన్బో లోరికేట్స్ , తురకో, క్వాకర్ పారాకీట్స్, మాండ్రిన్ డక్స్, ఆఫ్రికన్ గ్రే ప్యారెట్స్, గ్రాస్ పారా కిట్స్ వంటి జాతులకు చెందిన పదివేల పక్షులు హైదరాబాద్‌కు రానున్నాయి.

ఆరెకరాల్లో విదేశీ పక్షులు..

ఆరెకరాల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తున్న కొత్వాల్‌గూడ ఎకో పార్కులో విదేశీ పక్షులు అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణం, అరుదైన, అంతరించిపోతున్న వన్యప్రాణుల చట్టాలకు లోబడి నగరానికి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పీసెస్ , వన్యప్రాణి సంరక్షణ నిపుణుల ధ్రువీకరణ తర్వాత ఐవరి సందర్శనకు వీలు కలగనుంది. జూనోటిక్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర పరాన్నజీవులు ఆయా పక్షుల్లో లేవని నిర్ధారించుకున్న తర్వాతే హైదరాబాద్‌లో ఐవరి కేంద్రానికి తరలించనున్నారు. అప్పటివరకు 45 రోజుల పాటు నిపుణుల పర్యవేక్షణలో ఉంటాయని అధికారులు తెలిపారు. 45 రోజుల తర్వాత పక్షుల ఆరోగ్య స్థితిగతులు అనగా.. హైదరాబాద్ వాతావరణ పరిస్థితులకు నిలబడిన పక్షులను మాత్రమే ఐవరిలో సంరక్షిస్తామని అధికారులు వివరించారు.

వరదల నివారణకు సమగ్ర విధానం రూపొందించాలి

చిక్కడపల్లి, నవంబర్ 3: హైదరాబాద్ నగరంలో వరదల నివారణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(జేఎంఐ) ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పర్యావరణ నిపుణుడు బాబూరావు, జేఎంఐ ఆర్గనైజర్లు సురేందర్ కుమ్ములు, సామాజిక కార్యకర్త మజార్ హుస్సేన్, డాక్టర్ పృథ్వీ హాజరై మాట్లాడారు. నగర ప్రజల శ్రేయస్సు కోసం చెరువుల సంరక్షణ, పునరుద్ధరణ ద్వారా వరదలను నివారించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, దీనిపై సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. పునరుద్ధరణకు అవసరమైన చర్యలు, భవిష్యత్తులో వచ్చే వరదల ప్రభావానికి తగ్గట్టు ప్రణాళికలు ఉండాలని చెప్పారు. వరదల వల్ల నష్టపోయిన వారికి, పునరావాసం, న్యాయమైన పరిహారం ఉండాలన్నారు.

నాలెడ్జి సిటీలో బైక్ రేసింగ్.. 35 మందిపై కేసు

శేరిలింగంపల్లి, నవంబర్ 3: నాలెడ్జి సిటీలో బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న 35 మందిపై రాయదుర్గం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం ప్రకారం.. మాదాపూర్ నాలెడ్జి సిటీలోని టీహబ్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ రహదారులపై ప్రమాదకర స్థాయిలో ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ విన్యాసాలు చేస్తున్నారు. కేకలు వేస్తూ బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న 35 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్ రేసింగ్‌కు పాల్పడిన వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు

పూల ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పూలవిభాగం హెడ్ డా.జ్యోతి తదితరులు

అందుబాటులో పూల విత్తనాలు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 3: నాణ్యత గల పూల మొక్కల నారుమళ్లు అందుబాటులో ఉన్నాయని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ ఆధ్వర్యంలో గల రాజేంద్రనగర్ పూల విభాగం హెడ్ డా. జ్యోతి తెలిపారు. పూల పరిశోధన స్థానం పరిధిలో దాదాపు 8.5 ఎకరాల్లో నాణ్యత గల సీడ్ బంతి, చామంతి, మల్లె , లిల్లీ, గ్లాడియోలస్, కనకాంబరం, చైనా ఆస్టర్, తదితర నారుమళ్లతో పాటు , విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అతి తక్కువ ధరలతో పాటు మినీకిట్లు ఇవ్వనున్నామని, పరిశోధనల మొక్కలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తక్కువ మోతాదులో ఎకరాకు పైగా నాటేందుకు అయితే ముందుగా సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. నగరం సమీపంలోని రంగారెడ్డితో పాటు మహబూబ్ నగర్, నల్గొండ, మెదక్ తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

రామంతాపూర్, నవంబర్ 3 : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం అడప భరణి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. వినాయక కౌతం, శివకౌతం, రామాయణం, రామదాసు కీర్తన, పుష్పాంజలి, నిమశ్శివాతేయ్, అందరికీ అభయమిచ్చు, జతిస్వరం, తదితర కీర్తనలకు కళాకారులు కూచిపూడి నృత్యం చేసి అలరించారు. ధృవిక, రచన, కీర్తన, నిహారిక, నందిని, శిరీష, అద్భుతి, వేదశ్రీ, లావణ్య, హాసిని, మనోజ్ఞ, జ్యోతి